

డీఎస్‌డబ్ల్యూవో బదిలీ

పార్వతీపురం, జూన్7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్నతాధికారుల బదిలీలు ప్రారంభమయ్యాయి. త్వరలో మరికొన్ని శాఖల్లో పోస్టులు కూడా ఖాళీ అవ్వనున్నాయి. ఇప్పటికే వివిధ శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి (డీఎస్‌డబ్ల్యూవో) ఎండీ గయాయుద్దీన్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వేరే వారిని నియమిస్తారా..? లేక జిల్లా అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే 'మన్యం'లో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే.

మంత్రి లోకేశ్ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

● మంత్రి సంధ్యారాణి వెల్లడి ● అధికారులు, ఎమ్మెల్యేలతో సమీక్ష ● సభా స్థలం పరిశీలన



పార్వతీపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 9న మంత్రి నారా లోకేశ్ పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. శనివారం పార్వతీపురంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో సమీక్షించారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ 'షైనింగ్ స్టార్స్' పేరిట పురస్కారాలు అందించ నున్నారని ఆమె తెలిపారు. అనంతరం వారితో ముఖాముఖి నిర్వహించనున్నారని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉన్న రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి.. ఏర్పాట్లపై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పార్వతీపురంలో విద్యార్థులకు పురస్కారాల ప్రదానం తర్వాత చినబొండపల్లి సమీపంలో పార్టీ శ్రేణులతో సమావేశం ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా మన్యం జిల్లాకు మంత్రి లోకేశ్ వస్తు న్నందున పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు స్వయంగా మంత్రి లోకేశ్ జిల్లాకు రావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ విప్ జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ... మంత్రి లోకేశ్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక

(మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురం మండలం చినబొండపల్లిలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



ఏర్పాట్లపై మంత్రి , ఎమ్మెల్యేలతో చర్చిస్తున్న కలెక్టర్



పార్వతీపురం జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

పార్వతీపురం టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులు, దర్గాల వద్ద సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. జిల్లా కేంద్రం పాలకొండ రోడ్డులోని జామియా మసీదులో మత గురువులు తయబ్ రజా, ఫరూక్‌లు తమ సందేశాన్ని చదివి వినిపించారు. సర్వమానవాళి సుఖసంతోషాలతో జీవించాలంటే ధర్మసంస్థాపన కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. దేవుని ఆజ్ఞానలను పాటించాలని సూచించారు. దైవం పెట్టే ప్రతి పరీక్షలో నెగ్గుకు రావాలంటే త్యాగాలకు సిద్ధంగా ఉండా లన్నారు. స్నేహభావంతో మెలిగి.. శాంతి సామరస్యతో తోటివారికి సహాయపడాలని సూచించారు. దయతో ఉంటూ దాన ధర్మాలు చేస్తూ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం హుస్సేన్ , సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తే ఉద్యోగం

● ప్రభుత్వశాఖల్లో కొలువులంటూ రూ.53 లక్షల వసూలు
● తరువాత పత్తాలేకుండా పోయిన వైనం
● పోలీసులను ఆశ్రయించిన బాధితులు
● నలుగురి అరెస్టు.. మరో నలుగురు పరారు



వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైం, జూన్7(ఆంధ్రజ్యోతి): వారంతా వేర్వేరు జిల్లాలకు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు. ఒకరి ద్వారా ఒకరికి.. ఇలా అందరికీ పరిచయమయింది. అంతా కలిసి వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలంటూ నకిలీ అపాయింట్‌మెంటు లేఖలు, ఐడీ కార్డులను స్టేటస్‌ల్లో పెట్టేవారు. వీటిని చూసి నమ్మిన కొందరు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం వారికి రూ.లక్షలు చెల్లించారు. తీరా ఉద్యోగం అడిగితే రేపుమాపు అంటూ ఆ తొమ్మిది మంది మూడేళ్ల పాటు కాలక్షేపం చేశారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు పరారీలో, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు విలేకరులకు వివరాలను వెల్లడించారు. విజయనగరం ప్రదీప్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి సాయివెంకట సుజిత్, విజయనగరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన చెక్కా మహేష్, తూర్పుగోదావరి జిల్లా జంగారెడ్డి గూడేంనకు చెందిన నైనారపు చేతన్ రూబిన్‌కుమార్, ఏలూరుకు చెందిన గుంటూరు జాన్, ఏలూరు జిల్లా గొల్లాయిగూడెంనకు చెందిన కలపల యాకోబ్, శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, శేషగిరిరావు, లక్ష్మీనారాయణ రెడ్డి గ్రూప్‌గా ఏర్పడ్డారు. తమ వాట్సాప్ స్టేటస్‌ల్లో ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉన్నాయంటూ పోస్టులు పెట్టారు. దీంతో ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సిరికి వినోద్, లోతోటి జ్యోతి, పూసపాటిరేగ మండలం రెల్లివలసకు చెందిన తాటిపూడి జయరాజ్, అదే మండలానికి చెందిన కొవ్వాడ జాషువా.. సుజిత్‌ను సంప్రదించారు. దీంతో సుజిత్, తమ గ్రూప్ సభ్యులు కలిసి బాధితుల నుంచి 2022 నుంచి 2024 వరకూ అంచెలంచెలుగా రూ.53 లక్షలు వసూలు చేశారు. అలాగే ముత్యాల రామచంద్రరావు, కొరుప్రోలు శివకుమార్ అనే నిరుద్యోగులు కూడా వీరి బారిన పడ్డారు. తమకు ఉద్యోగాలు ఎప్పుడు

(మిగతా 8వ పేజీలో)

నిఘా లేక.. తరలింపు ఆగక

● నాగావళిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు
● కోతకు గురవుతున్న తీరం
● పొంచి ఉన్న ప్రమాదం

6లో

భవనం నిర్మించారు.. మరుగుదొడ్లు మరిచారు

● ఇదీ గరుగుబిల్లి పీహెచ్‌సీలో పరిస్థితి

8లో

నాలుగు రోజులపాటు సచివాలయాల్లో సేవలకు అంతరాయం

గరుగుబిల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నాలుగు రోజుల పాటు పలు సేవలకు అంతరాయం కలగనుంది. సచివాలయశాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవ పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుంచి రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలిస్తుండడమే ఇందుకు కారణం. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు వివిధ సేవలను నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర జీఎస్ డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ప్రకటించారు. సేవలు నిలుపుదల కారణంగా

(మిగతా 8వ పేజీలో...)

భారీ వర్షాలపై అప్రమత్తం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నదులు, కాలువలు, చెరువులు తదితర జలవనరుల్లో ఎవరూ దిగకుండా చూడాలన్నారు. రహదారులు, కల్వర్టులపై నుంచి నీరే పారే చోట్ల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని , గ్రామాల్లో పారిశుధ్య మెరుగు పనులు చేపట్టాలని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. ఖరీఫ్ రైతులకు తగు సలహా, సూచనలు ఇవ్వాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. తాగునీరు , విద్యుత్ సరఫరా , ఆసుపత్రుల అత్యవసర విభాగాల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రులు, వసతిగృహాలకు తరలించాలన్నారు. పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. వీఆర్‌వోలు ప్రధాన కేంద్రాల్లో ఉండి పరిస్థితులకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

శానిటేషన్ డ్రైవ్

జిల్లాలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కాలువల్లో పూడికలు తీయాలని, మురుగునీరు ఎక్కడ నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ జరగాలని, వాటిని చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే నిర్వహించాలన్నారు. నీటి నిల్వ అవకాశం లేకుండా చూడాలని ఆదేశించారు. మురుగుకాలువల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల దగ్గరలో ఉండే నీటి వనరుల్లో

(మిగతా 8వ పేజీలో...)



అమ్మో.. ఏనుగులు

గరుగుబిల్లి/సీతానగరం, జూన్7(ఆంధ్రజ్యోతి): గజరాజులు గరుగుబిల్లి నుంచి సీతానగరం వైపు పయనమయ్యాయి. శనివారం ఆ మండలంలోని బూర్జ-వెంకటాపురం గ్రామాల మధ్య సంచరించాయి. దీంతో ఆయా గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్లు ఏనుగులను పర్యవేక్షిస్తున్నారు. చినగుడబ నుంచి అనుకోకుండా సీతానగరం మండలం వైపు ఏనుగులు వచ్చాయని, వాటిని జోగింపేట జోన్‌కు తరలించడం తన పరిధిలో లేదని బీట్ ఆఫీసర్ సతీష్ తెలిపారు. మొత్తంగా ఎనిమిది గజరాజులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ.. త్వరలో రెండు కుంకీలు రానునున్నాయని వాటి సాయంతో జిల్లాలో ఏనుగులను వేరే ప్రాంతాలకు తరలిస్తామని తెలిపారు.


తీవ్రమైన తలనొప్పా.. అశ్రద్ధ వద్దు

● నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



6లో

విజయనగరం జిల్లాలో కొవిడ్ కలకలం



విజయనగరం రింగురోడ్డు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో కొవిడ్ కలకలం చోటుచేసుకుంది. నెల్లిమర్ల మండలానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి గతవారం రోజులుగా దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా ఎంతకీ తగ్గక పోవ డంతో శనివారం జిల్లా కేంద్రా సుపత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. దీంతో వైద్యులు సాధారణ పరీక్షలతో పాటు కొవిడ్ టెస్టు కూడా చేశారు. దీంతో కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయి నట్లు తెలిసింది. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి వద్ద ప్రస్తావించగా.. 'నెల్లిమర్ల వ్యక్తికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇంకా ఆయనకు మరిన్ని పరీక్షలు చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆ వ్యక్తిని ఆయన ఇంటిలోనే హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నాం. అతని కుటుంబ సభ్యులు, స్థాని కులకు కూడా పరీక్షలు చేసేందుకు బృందాలను పంపించాం.' అని తెలిపారు.

సమగ్ర నీటి పథకానికి మోక్షం


● పనుల కాల వ్యవధిని పొడిగించిన ప్రభుత్వం
● మళ్లీ టెండర్లు పిలవడానికి సమాయత్తం
● వైసీపీ హయాంలో శంకుస్థాపనకే పరిమితం

సాలూరు రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణ వాసుల భవిష్యత్ తాగునీటి అవసరాల కోసం నిర్మించతలపెట్టిన సమగ్ర నీటి పథకానికి మోక్షం లభించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. వాస్తవంగా ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులు రూ. 68.98 కోట్లతో పెద్దగెడ్డ ప్రాజెక్ట్ నుంచి సాలూరుకు తాగునీరు తేవాలని అప్పట్లో సంకల్పించారు. ఈ మేరకు 2022, సెప్టెంబరు 10న అప్పటి డిప్యూటీ సీఎం రాజన్నదొర సాలూరులో పనులకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ పైపులు సైతం తెచ్చారు. అయితే ఏ కారణం చేతో పనులు ప్రారంభం కాలేదు. కాంట్రాక్టర్ కాలవ్యవధి పూర్తి కావడంతో తెచ్చిన పైపులు తీసుకెళ్లిపోయారు. ఈ బ్యాంక్ నిధులతో పార్వతీపురం, పాలకొండలో సైతం అంతంత మాత్రంగానే పనులు జరిగాయి. అయితే ఈ సమస్యను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం పనులు చేపట్టే దిశగా చర్యలు చేపట్టింది. ఏఐఐబీ పనుల కాల వ్యవధిని 2028, మార్చి నెలాఖరు వరకు పొడిగించింది. దీంతో పార్వతీపురం, పాలకొండ, సాలూరు పట్టణ వాసుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు లైన్ క్లియరైంది. కాగా సాలూరులో నాలుగు ట్యాంక్‌ల ద్వారా ప్రస్తుతం తాగు నీరు సరఫరా చేస్తున్నారు. మున్సిపాల్టీలో 3620 ప్రైవేట్ కుళాయిలు, 125 పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. రోజుకు 7 ఎంఎల్‌డీ అవసరముండగా

(మిగతా 8వ పేజీలో...)



సమగ్ర నీటి పథకానికి 2022లో వేసిన శిలాఫలకం



సాలూరులోని మక్కువ బైపాస్‌లో ఉన్న నీటి ట్యాంక్

తీవ్రమైన తలనొప్పా.. అశ్రద్ధ వద్దు



శరీరంలోని అన్ని అవయవాలను నియంత్రించేది మెదడు. మెదడులో గెడ్డ (ట్యూమర్) ఏర్పడితే, అప్పుడు పరిస్థితి చిన్నాభిన్నం అవుతుంది. అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు. ఇటీవల బ్రెయిన్ ట్యూమర్ బాధితులు పెరుగుతున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ఆధునాతన శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. ఆదివారం వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్‌డే పుస్కరించుకుని ప్రత్యేక కథనం..

నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

- పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు
- ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో శస్త్రచికిత్సలు
- అందుబాటులో అత్యాధునిక వైద్యసేవలు

విజయనగరం రింగురోడ్డు, జూన్ 7(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నెలకు 150 పైగా బ్రెయిన్ ట్యూమర్ కేసులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన తలనొప్పితో వచ్చే వారికి వైద్యులు బ్రెయిన్ స్కాన్ చేసి వ్యాధి నిర్ధారణ చేసి అవసరమైన చికిత్సలు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వారిలో బ్రెయిన్ ట్యూమర్‌లు ఎక్కువగా వచ్చేవని. ఇప్పుడు 15 ఏళ్ల చిన్నారులు, 30 నుంచి 40 ఏళ్ల వయస్సు వారిలోనూ వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్స్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. చిన్న పిల్లల్లో జన్యుపరమైన లోపాలే కారణంగా చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో న్యూరాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ నరాలకు సంబంధించిన చికిత్సతో పాటు బ్రెయిన్ ట్యూమర్ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మెదడులోని కణతులకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారు. బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వ్యయం అవుతుంది. అయితే, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వీటిని నిర్వహిస్తున్నారు.



లక్షణాలు ఇవే..

బ్రెయిన్ ట్యూమర్ ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటి. దీని లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించడం కష్టమేకానీ అసాధ్యమేమీ కాదు. బ్రెయిన్ ట్యూమర్ వస్తే కన్పించే అత్యంత సాధారణ లక్షణం దీర్ఘకాలిక తలనొప్పి. దీన్ని చాలామంది పట్టించుకోరు. మానసిక ఆందోళన, డీహైడ్రేషన్ వంటి సమస్య వల్ల కూడా తలనొప్పి వస్తుంది. కానీ బ్రెయిన్ ట్యూమర్ సూచించే ప్రారంభ లక్షణాలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు.

● తలనొప్పి

బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించిన లక్షణాల్లో తలనొప్పి సాధారణమని వైద్యులు చెబుతున్నారు. ఈ తలనొప్పి తీవ్రంగా ఉంటుంది. కొన్ని సార్లు, రోజులో ఎక్కువ సార్లు నొప్పి రావచ్చు. కొంతమందికి తలనొప్పితో పాటు వాంతులు కూడా అవుతాయి.

● దృష్టిలోపాలు

బ్రెయిన్ ట్యూమర్ వల్ల కంటిలోని ఆప్టిక్ నరాలు ప్రభావితం అవుతాయి. ఒక్కొక్కసారి దృష్టి లోపం కూడా రావచ్చు. కంటి చూపులో ఎలాంటి తేడాలు కన్పించినా, మెదడులో కణితిని సూచించవచ్చునని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

● మూర్ఛలు

బ్రెయిన్ ట్యూమర్ వల్ల గతంలో ఎప్పుడూ మూర్ఛలేని వారిలో ఇవి హఠాత్తుగా కలుగుతాయి. శరీరం వణుకుతుండడం, తదేకంగా చూస్తూ ఉండిపోవడం, స్పృహ కోల్పోవడం జరగవచ్చు.

● అశ్రద్ధ చేస్తే..

బ్రెయిన్ ట్యూమర్‌ను అశ్రద్ధ చేస్తే మూర్ఛ, పక్షవాతానికి గురై మంచానికి పరిమితమై పోతారు. మాట పడిపోవడం, జ్ఞాపకశక్తిని కోల్పోవడం జరుగుతుంది. కొన్ని ట్యూమర్‌లో క్యాన్సర్ పెరగడంతో మెదడులోని కీలకభాగాలు దెబ్బతిని కొన్ని నెలల వ్యవధిలోనే ప్రాణాంతకం కావచ్చును.

కారణాలు ఇవే..

జన్యుపరమైన లోపాలు, తీసుకునే ఆహారం, రేడియేషన్ ప్రభావం, పొగ, మద్యం తాగడం

నిర్ధారణ ఇలా..

తలనొప్పి వచ్చిన రోగికి సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లు చేయడం ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌లను నిర్ధారిస్తారు. ఒకప్పుడు బ్రెయిన్ ట్యూమర్ నాలుగోదశ వచ్చే వరకూ గుర్తించేవారు కాదు. నిర్ధారణ కాకపోతే, మరణించిన వారు కూడా ఉన్నారు. ఇప్పుడు అత్యాధునిక డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి రావడంతో తొలిదశలోనే గుర్తించ గలుగుతున్నారు.

ఆధునిక చికిత్సలు

బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో ఏఐ, నాన్-ఇన్‌వేసివ్ పద్ధతులు ఉన్నాయి. బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో ఇటీవల కాలంలో వచ్చిన అవిష్కరణలు రోగులకు సరికొత్త ఆశలను అందిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత స్కానింగ్ పద్ధతులు, నాన్-ఇన్వేసిన్ సర్జరీలు మరింత కచ్చితంగా, సురక్షితంగా మారుస్తున్నాయి.

● బ్రెయిన్ ట్యూమర్‌ల నిర్ధారణలో ఏఐ కీలకపాత్ర పోషిస్తోంది. ఎంఆర్ఐ సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ డేటాను విశ్లేషించడానికి ఏఐ అల్గారిథమ్‌లు ఉపయోగపడుతున్నాయి. ఇవి కన్ను గుర్తించలేని అతి చిన్న ట్యూమర్‌లను, వాటి పరిధిని, స్వభావాన్ని కచ్చితంగా గుర్తిస్తాయి.

● లేజర్, ఇంటర్‌స్టీషియల్, థర్మర్ థెరపీ (ఎల్ఐటీటీ): ఈ పద్ధతుల్లో ఒక చిన్న లేజర్ ఫైబర్‌ను ట్యూమర్‌లోకి ప్రవేశపెడుతారు. లేజర్ శక్తిని ఉపయోగించి ట్యూమర్ కణాలను వేరుచేసి నాశనం చేస్తారు. ఇది ఎంఆర్ఐ గైడెన్స్‌లో జరుగుతుంది. ఇది కచ్చితత్వాన్ని పెంచుతుంది. ఈ అధునాతన పద్ధతులు తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావంతో వేగంగా కోలుకునే అవకాశం ఉంది.

● ఎండోస్కోపిక్ బ్రెయిన్ సర్జరీ: న్యూరో సర్జన్ ఒక సన్నని సౌకర్యవంతమైన ట్యూబ్ (ఎండోస్కోపు)ను ఉపయోగిస్తారు. ఈ ఎండోస్కోప్ కెమెరా, లైట్ జతచేయబడి ఉంటాయి. ఇది లోపలి భాగాలను పెద్దది చేసి స్పష్టంగా చూపిస్తుంది. ఈ ఎండోస్కోప్‌ను చాలా చిన్న కోతల ద్వారా లేదా ముక్కు, నోరు ద్వారా మెదడులోకి ప్రవేశపెడతారు. చిన్న, ప్రత్యేకమైన శస్త్రచికిత్స పరికరాలు కూడా ఎండోస్కోప్ ద్వారా పంపించి ట్యూమర్‌ను తొలగిస్తారు. ఈ శస్త్రచికిత్స వల్ల పెద్ద కోతలు, పుర్రె ఎముకను పెద్దగా తొలగించడం అవసరం ఉండదు. ఈ సర్జరీ ద్వారా రోగి త్వరగా కోలుకుని ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జి కావచ్చును.

● కీ హోల్ సర్జరీ: న్యూరో సర్జన్ తలపై చిన్నకోత పెడతారు. కొన్ని సందర్భాల్లో ముక్కు లేదా నోరు ద్వారా కూడా ప్రవేశపెట్టవచ్చును. దీనిద్వారా సన్నని ట్యూబ్‌ను మెదడులో ప్రవేశపెడతారు. ఎండోస్కోప్ ద్వారా లేదా పక్కనే చేసే చిన్న కోతలు ద్వారా సన్నని, ప్రత్యేకంగా రూపొందించిన శస్త్రచికిత్స పరికరాలను పంపించి ట్యూమర్‌ను పూర్తిగా తొలగిస్తారు. దీని ద్వారా శస్త్రచికిత్స తరువాత వచ్చే దుష్ప్రభావాలు చాలావరకూ ఉండవు.

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో శస్త్ర చికిత్సలు..



ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో న్యూరాలజీ విభాగం ఉంది. ఇక్కడకు బ్రెయిన్ ట్యూమర్ బాధితులు వస్తున్నారు. వారి పరిస్థితిని అంచనా వేసి, ఔషదాలు ఇవ్వడమా? శస్త్ర చికిత్సను చేయడమా? అనేది నిర్ధారిస్తాం. ఎక్కువగా తలనొప్పి వస్తుండడం, దృష్టి లోపాలు ఏర్పడం, మూర్ఛలు వంటి లక్షణాలు కలిగితే, అశ్రద్ధ చేయకుండా వైద్యుడ్ని సంప్రదించాలి.

-డాక్టరు బి.డి. భరత్‌సింగ్‌నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి

కచ్చితమైన నిర్ధారణ..



అత్యాధునిక పరీక్షల ద్వారా మెదడులో గడ్డ ఉంటే అది ట్యూమరా? ఇంకేమైనా అనేది కచ్చితంగా తెలుసుకోవచ్చును. ఒకవేళ ట్యూమర్‌ను క్యాన్సర్ అని అనుమానిస్తే, ఎంఆర్ఐ స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఇవి తెలుసుకోవడానికి ఎంఆర్ఐ విత్ స్పెక్ట్రోస్కోపీ చేస్తాం. దీంతో కణితి క్యాన్సరా? కాదా? అన్నది బయట పడుతుంది. ఒక వేళ క్యాన్సర్ అని అనుమానిస్తే, కణితి నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షలకు పంపిస్తాం. బ్రెయిన్ ట్యూమర్‌కి కీ హోల్, ఎండోస్కోపీ వంటి అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ చికిత్సలను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేయించుకోవచ్చు.

-డాక్టర్ ఈశ్వరరావు తమటాపు, బ్రెయిన్ అండ్ స్పైన్ సర్జన్

సూపర్ సిక్స్.. ఒక్కటొక్కటిగా అమలు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో రాయితీపై విత్తనాలను రైతులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్‌సిక్స్ ఒక్కటొక్కటిగా అమలు చేస్తోందన్నారు. రైతులకు అవసరమైన యంత్రాలను రాయితీపై అందిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సాగునీటి కాలువల ఆధునీకీకరణ పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి రైతుసేవాకేంద్రాల ద్వారా అందజేస్తామన్నారు. జిల్లాకు 50 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెస్తోందన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

అనంతరం బొండపల్లి మండలానికి చెందిన రైతులకు డ్రోన్ యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యులు, మాజీ మంత్రి పడాల అరుణ, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, వ్యవశాయశాఖ జిల్లా అధికారి వీటీ రామారావు, ఏడీఏ కె.మహరాజన్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవితో పాటు దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలపార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్, కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న మంత్రి సంధ్యారాణి

జీవనశైలిలో యోగా భాగం కావాలి

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవనశైలిలో యోగా ఒక భాగం కావాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్, మెప్మా, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది వివిధ ఆసనాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యోగాతో ఆనందకరమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతత, ఒత్తిడిని జయించేందుకు ఇదొక గొప్ప సాధనమని తెలిపారు. జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్న యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు

నెల్లిమర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థ రామస్వామి వారి దేవస్థానంలో శనివారం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. విజయనగరంలోని మయూరి నృత్యాలయ సంస్థ డైరెక్టర్ ఎం.శ్రీదేవి కృష్ణ ఆధ్వర్యంలో కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సుమారు 25 మంది విద్యార్థినులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

నిఘా లేక.. తరలింపు ఆగక

- నాగావళిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు
- కోతకు గురవుతున్న తీరం ● పొంచి ఉన్న ప్రమాదం



సంతోషపురం ప్రాంతంలో యంత్రంతో ఇసుక తవ్వకాలు జరుగుతున్న దృశ్యం

గరుగుబిల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. రెవెన్యూతోపాటు పలు శాఖల అధికారుల నిఘా లేకపోవడం వల్ల అనుమతులు లేకున్నా యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సంతోషపురం, సుంకి, పిట్టలమెట్ట, తోటపల్లి ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం నదిలో తక్కువ నీటి ప్రవాహం ఉండడంతో తవ్వడానికి అనుకూలంగా ఉందని పలువురు చెబుతున్నారు. నది ఒడ్డుకు ఆనుకుని ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందన్న ఆందోళన నెలకొంది. ఒడ్డుకోత వల్ల గ్రామాలు, పంట పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం పొంచిఉందని పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు. గతంలో ప్రాజెక్టుకు ఆనుకుని ఇసుక తవ్వకాల వల్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడిన విషయం విదితమే. దీంతో తోటపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోతుల్లో పడి మృత్యువాత పడిన సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి నదీ మార్గంలో సంతోషపురం, సుంకి, పిట్టలమెట్ట, తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలతో పాటు స్నానాలకు వస్తుంటారు. తక్షణమే అధికారులు దృష్టి సారించి సుంకి, సంతోషపురం, తోటపల్లి, పిట్టలమెట్ట, సాంబన్నవలస ప్రాంతాల వైపు నుంచి ఇసుక తరలింపును అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్‌ను ముస్లింలు ఉమ్మడి జిల్లాలో శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ ప్రత్యేకతను తెలియజేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



కురుపాంలో..



బొబ్బిలిలో..

ఉపాధ్యాయుల నిరసన

- మాన్యువల్‌గా ఎస్జీటీల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్

విజయనగరం కలెక్టరేట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలను ఆన్‌లైన్ లో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఎస్జీటీల బదిలీలు నిర్వహించడం వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. మాన్యువల్‌గా నిర్వహించాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలు మొదటి ఆప్షన్ చూపించి... తరువాత ఉత్తర్వులు జనరేట్ చేసే ముందు ఖాళీలను తొలగించడంతో చాలా మంది సదూర ప్రాంతాలకు బదిలీ కావలసి వచ్చిందన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ వైబ్‌సైట్‌లో తప్పనసరి బదిలీగా చూపడంతో వారు ఆప్షన్ ఇచ్చుకోలేక పోయారని తెలిపారు. తుది సీనియారిటీ జాబితాలను విడుదల చేయకుండా... ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండా ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలా మంది నష్టపోయారని తెలిపారు. ఈ సమస్యను విద్యాశాఖ అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్ద కల్వర్టు కింద చిన్న కల్వర్టు

బొబ్బిలి రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెద్ద కల్వర్టు కింద చిన్న కల్వర్టు కనిపిస్తోందని ఆశ్చర్యపోతు న్నారా? నిజమే.. చిన్న కల్వర్టును అధికారులు తొలగించడం మర్చిపోయారంతే. మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ బట్టివలస గ్రామానికి వెళ్లే దారిలో వెంగళరాయ సాగర్ కాలువపై గతంలో నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కొంచెం పెద్దదిగా కొత్త వంతెన నిర్మించారు. అయితే పాత కల్వర్టును తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వెంగళ రాయసాగర్ నుంచి వచ్చే నీరు శివారు భూములకు వెళ్లదని రైతులు ఆందోళ చెందుతున్నారు. పాత కల్వర్టు శిథిలాల వల్ల కాలువకు గండి పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఈ విష యంపై నీటిపారుదల శాఖ ఏఈ సుధీర్‌ని వివరణ కోరగా పాత కల్వర్టును తొలగిస్తామన్నారు.



బట్టివలస వెళ్లే దారిలో కాలువపై పాత కల్వర్టు తొలగించని దృశ్యం

విశాఖ రైల్వే జోన్ ప్రక్రియ వేగవంతం: ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

విజయనగరం రూరల్/రాజాం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేజోన్ ప్రక్రియ మరింత వేగవంతం కానుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రైల్వేజోన్‌కి సంబంధించి జీఎంని నియమించడం హర్షణీయమన్నారు. శనివారం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రకు జోన్ కేటాయించడం పట్ల ప్రధాని మోదీకి, ఈ విషయంలో ఎంతో కృషి చేసిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2019 నుంచి 2024 వరకూ అధికారం వెలగబెట్టిన వైసీపీ రైల్వే జోన్ గురించి, ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. ఉత్తరాంధ్రలో వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూనే, మరోవైపు పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. కరోనా ఉందని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారని.. అలాంటపుడు వెన్నుపోటు నిరసనలు ఎలా చేశారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి రోజులు..

లక్కవరపుకోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటన అనంతరం జీఎంను నియమించడం శుభపరిణామమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడంతో రాష్ట్రానికి కావాల్సిన నిధులను చంద్రబాబు నాయకత్వంలో సాధిస్తున్నామని తెలిపారు. రూ.149 కోట్లతో రైల్వేజోన్ కార్యాలయాన్ని 9 అంతస్తులతో నిర్మించనున్నట్టు చెప్పారు. దీంతో ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూ.75వేల కోట్లతో జాతీయ రహదారులు, రూ.72 వేల కోట్లతో రైల్వే లైను నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లలో రైల్వేజోన్ కోసం ప్రయత్నించలేదని విమర్శించారు. 54 ఎకరాలు కేటాయించ లేకపోయిందని విమర్శించారు. ఏడాదిలో కేంద్రం సాయంతో అనేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఈ సమావేశంలో చొక్కాకుల మల్లు నాయుడు, జీఎస్ నాయుడు, రాయవరపు చంద్రశేఖర్, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు బహిష్కరించిన వేతనదారులు



నిరసన తెలుపుతున్న వేతనదారులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పంచాయతీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యారావు, టెక్నికల్ అసిస్టెంటు రాధ తమ శ్రమను దోచుకుంటున్నారంటూ ఉపాధి మేట్లు, వేతనదారులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. జేఈ రామసత్యం కొలతలకు రావడం లేదని ఆరోపించారు. ఈ మేరకు పనులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధి మేట్లు, వేతనదారులు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఆరు రోజులు పనిచేస్తే ఐదురోజులు... ఐదు రోజులు పనిచేస్తే మూడు రోజులు మాత్రమే మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు. విశాఖపట్నంలో పని చేస్తున్న తన కొడుకు ఏడాదిలో వంద రోజులు, 98 రోజులు పని చేసినట్టు నమోదు చేసి.. పెద్ద ఎత్తున డబ్బులు వెనకేసుకుంటున్నాడని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా తన తల్లిదండ్రుల కార్డులో కొడుకు పేరు నమోదు చేయించి...ఉపాధి నిధులు డ్రా చేస్తున్నాడని తెలిపారు. తనకు నచ్చిన గ్రూపులకు రూ.250 వరకు నచ్చని గ్రూపులకు రూ.160 వరకు వేస్తున్నాడని తెలిపారు. తమకు అన్యాయం జరిగిందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల అధికారులతో విచారణ చేపడితే వాస్తవాలు బయట పడతాయని అన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో సన్యాసిరావు, లక్ష్మణ, సూరిబాబు తదితరులు ఉన్నారు. ఈ విషయమై ఏపీఓ రమ్యను వివరణ కోరగా...సోమవారం గ్రామంలోకి వెళ్లి విచారణ చేపడతామని తెలిపారు.

రాత్రి విధుల యోచనను ఉపసంహరించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

రాజాం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం కార్మికులకు వ్యతిరేకంగా ఆమోదించిన 12 గంటల పని విధానం, మహిళలతో రాత్రి పూట పని చేయించుకోవడం తదితర మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కార్మిక చట్టాలను మారుస్తూ క్యాబినెట్ నిర్ణయించడం దుర్మార్గమైన చర్యని అన్నా రు. ఈ మార్పులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులు పని చేస్తున్న షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో గత 13 సంవత్సరాలుగా కనీస వేతన సవరణ జరగలేదని నిరసన వ్యక్తం చేశారు. 30 లక్షల మందికి పైగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించలేదని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం పని గంటలు పెంచడం... రాత్రి పూట మహిళలతో పనిచేయాలని నిర్ణయించడం తగదన్నారు. ఈ సమావేశంలో అనిల్‌కుమార్, లక్ష్మి, గురువులు, బాలరాజు, వైకుంఠ వాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రాజాం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామానికి చెందిన మూడడ్ల అప్పలనాయుడుకు గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రగాయాలైనట్టు పట్టణ సీఐ కె.అశోక్‌కుమార్ శనివారం రాత్రి తెలిపారు. పోలీసులు అందించిన వివరాల మేరకు మూడడ్ల అప్పలనాయుడు గ్రామం నుంచి ఈనెల 2న సైకిల్‌పై మామిడి పండ్లు తీసుకొని రాజాం మార్కెట్‌కు వస్తుండగా కొత్తపేట సమీపంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొని వెళిపోయాడు. దీంతో అప్పలనాయుడుకు కుడి కాలవిరిగిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వందేళ్లుగా పోరాటం

శృంగవరపుకోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గడిచిన వందేళ్లుగా పేద, మధ్య తరగతి ప్రజలు, కార్మికులు, కర్షకుల తరఫున పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని రాష్ట్ర ప్రతినిధి కామేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఎస్.కోటలో నియోజకవర్గ 18వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మట్లాడుతూ హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడుతున్న పార్టీ సీపీఐ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జెండా ఆవిష్కరించారు.

కూటమితోనే అభివృద్ధి

రాజాం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్ అన్నారు. శనివారం గారాజు చీపురుపల్లిలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

పార్టీలకు అతీతంగా ఆర్థిక సాయం



చెక్కులు అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందజేయనున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు తెలిపారు. సీఎం సహాయ నిధి కింద మంజూరైన సుమారు రూ.4.73 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమన్నారు. అదే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కూడా పని చేస్తున్నారన్నారు. మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని రామ్‌మల్లిక్ కోరారు. ఈ కార్యక్రమంలో గుర్ల మండల పార్టీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవంలో..

గుర్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంచి ఆలోచనతో మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ యువ నాయకుడు కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. కొండగండ్రేడు గ్రామంలో శనివారం విఘ్నేశ్వర, సీతారామ, సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రైం న్యూస్

ఎయిర్‌పోర్టు పనుల్లో అపశ్రుతి

వాహనం కిందపడి కార్మికుడి మృతి

భోగాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కంచేరు సమీపంలో నిర్మాణం లో ఉన్న ఎయిర్ పోర్టు నిర్మాణ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి బిహార్‌కు చెందిన అంకిత్ కుమార్(26) ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం అంకిత్ ఎల్అండ్‌టీ సంస్థలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మోటార్ గ్రాడర్ (మట్టి పోగులను చదును చేసే వాహనం)తో పని చేస్తున్నాడు. వాహనం మరమ్మతులకు గురికావడంతో నిలిపివేశాడు. ముందుకొచ్చి పరిశీలిస్తుండగా... ప్రమాదవశాత్తూ వాహనం కదిలి అంకిత్ కుమార్ పైకి దూసుకుపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సూర్‌వైజర్ ప్రదీప్‌కుమార్ మోహతా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



యంత్రంతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

గంట్యాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మదుపాడ గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేకుండా జేసీబీలతో మట్టి తవ్వి వేరే ప్రాంతానికి తరలిస్తున్నారు. సాధారణంగా ఓ రైతు తన పొలంలోని మట్టిని తవ్వి... వేరే ప్రాంతానికి తరలించాలన్నా రెవెన్యూ, మైన్స్ అధికారులు అనుమతి తీసుకోవలసి ఉంటుంది. కానీ కొన్ని చోట్ల నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. మదుపాడ రెవెన్యూ పరిధిలో ఓ రైతు పొలంలోని మట్టిని ట్రాక్టర్లతో ఓ ప్రైవేటు లేఅవుట్‌లోకి తరలిస్తున్నారు. గతంలో ఆ రైతుకు ప్రభుత్వం డి.పట్టా ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై శనివారం సాయంత్రం రెవెన్యూ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో తహశీల్దార్ నీలకంఠరేశ్వరరెడ్డి సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. తవ్వకాలు నిలిపి వేయించామని తహసీల్దార్ వెల్లడించారు. సంబంధిత రైతును పిలిపించి మాట్లాడతామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రింగురోడ్డు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టరు దగ్గుమటి శ్రీహరి ఆధ్వర్యంలో శనివారం అన్ని రకాల వైద్య రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర పూర్వ వైస్ చైర్మన్ డాక్టర్ జేసీ నాయుడు హాజరయ్యారు. దేశంలోనే తొలిసారిగా వైద్య వృత్తిపరమైన లైసెన్సుల పునరుద్ధరణ, పునఃరిజిస్ట్రేషన్లు, పీజీ రిజిస్ట్రేషన్లు, ఎన్‌ఓసీలు ఇక్కడ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు శ్రీహరి చెప్పారు.

సాంబరాజు మృతి టీడీపీకి తీరని లోటు: మంత్రి



సాంబరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాస్

గుర్ల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితం మృతిచెందిన నాయకులు సాంబరాజు లేకపోవడం మండల తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం కెల్ల గ్రామంలోని సాంబరాజు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్.మహేశ్వరరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, కార్యవర్గ సభ్యులు తిరుమలరాజు కిరణ్‌కుమార్‌రాజు, గొర్లె రామానాయుడు, కిలారి సూర్యనారాయణ, కే.గోవిందు, దాసరి శివప్రసాద్, మండల అప్పలనాయుడు పాల్గొన్నారు.

జడ్పీచైర్మన్ పరామర్శ

ఇటీవల మృతిచెందిన సాంబరాజు కుటుంబాన్ని జడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వరదా ఈశ్వరరావు, బెల్లాన బంగారునాయుడు, బొల్ల సుబ్రహ్మణ్యం, తోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుపేట గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి రూ.10 వేల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. తూడెం గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆమె రూ.10వేలు అందజేశారు. అమటాం రాయవలసలో జనసేన కార్యకర్త భార్య బంగారమ్మ రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. రామదాసుపేట అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సవరవల్లి సర్పంచ్ ఉప్పాడ ఉదయభాస్కర్ ఆర్థిక సాయంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు.

జనసేనలో చేరిక

పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు శనివారం జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. ముంజేరు సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో వీరంతా జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నీలాపు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డీసీసీబీ పీఐసీగా నాగార్జునకు

నేడు అభినందన సభ

విజయనగరం రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పీఐసీగా నియమితులైన జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున కు అభినందన సభను ఆదివారం ఉదయం ఫూల్‌బాగ్ రోడ్డులోని జె కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

నేడు గొంప కృష్ణ బాధ్యతల స్వీకరణ

జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పర్సన్ ఇన్‌ఛార్జిగా గొంప కృష్ణ ఆదివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటికే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానాలు పంపారు. మరోవైపు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి డీసీఎంఎస్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎస్.కోట తహసీల్దార్‌కు మెమో

విజయనగరం కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండలం వేములాపల్లి గ్రామ రెవెన్యూ అధికారి సీహెచ్ కృష్ణ మృతి చెందిన సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి నిర్ణీత సమయంలో అందించడంలో జాప్యానికి వివరణ కోరుతూ ఎస్.కోట తహసీల్దార్‌కు శనివారం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమో జారీ చేశారు. 'బదిలీల్లో ప్రత్యేకత' అనే శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్... వీఆర్వో సీహెచ్ కృష్ణ మే 28న మృతి చెందినప్పటికీ సకాలం సమాచారం ఎందుకు ఇవ్వలేదో వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు. బదిలీ ఉత్తర్వులు జారీ అయిన తరువాత కూడా వీఆర్వో మృతిపై సమాచారం ఇవ్వనందుకు వివరణ ఇవ్వాలని కూడా మెమోలో పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పల్లా మృతికి సంతాపం

విజయనగరం రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘ నాయకుడు పల్లా సింహాచలం శనివారం మృతి చెందడం పట్ల మాజీ మున్సిపల్ చైర్మన్లు ప్రసాదుల రామకృష్ణ, ప్రసాదుల కనక మహాలక్ష్మి సంతాపం తెలిపారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘ నాయకులు మన్యాల కృష్ణ, ముచ్చి రామలింగస్వామి, పల్లా అప్పలస్వామి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

వేపాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చామలాదేవి అగ్రహారంలో శనివారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి డీసీఎంఎస్ అధ్యక్షులు గొంప కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తహసీల్దారుగా రాజశేఖర్ బాధ్యతలు

రాజాం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజాం తహశీల్దార్‌గా ఎం.రాజశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజును జామికి బదిలీ చేయడంతో ఆయన స్థానంలో రాజశేఖర్ నియమితులయ్యారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

లక్కవరపుకోట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కల్లేంపూడి గ్రామంలో సంతాన వేణుగోపాలస్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా స్వామివారికి పి.త్రినాథ్, శ్రీలక్ష్మి దంపతులు శతమానం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఏడువాక శ్రీనివాసరావు లక్ష్మి, బి.పట్టాభిరామారావు, బి.రామకృష్ణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌తో ఉపయోగం

లక్కవరపుకోట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ ఆడేందుకు దివ్యాంగులు ముందుకు రావాలని... తద్వారా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని పారా స్పోర్ట్స్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి అన్నారు. చైతన్య యాత్ర ఎల్.కోట చేరుకున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే లలితకుమారిని కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.దయానంద్, ప్రతాప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వెంకన్న

జామి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కుమరాంలోని కల్యాణ్‌నగర్‌లో ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం గరుడ వాహనంపై వేంకటేశ్వరుని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన గళం

వెబ్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ ఖాళీలు మొదట ఆప్షన్ చూపించి... తరువాత ఉత్తర్వులు జనరేట్ చేసే ముందు ఖాళీలను తొలగించడంతో చాలా మంది సదూర ప్రాంతాలకు బదిలీ కావలసి వచ్చిందన్నారు. అందుకే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వివిధ మండలాల్లో ఎంఈవోలకు వినతిపత్రాలు సమర్పించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



రాజాం: ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



నెల్లిమర్ల: ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



ఎస్.కోట: నిరసన వ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

శృంగవరపుకోట రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పోతనాపల్లి గ్రామంలోని శ్రీరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ పూజలు శనివారంతో ముగిశాయి. వేదపండితుడు దొంతూకూర్తి సాయికుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో ఈ క్రతువును చేయించారు. ఈ సందర్భంగా శనివారం అన్న సమారాధన నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయంలో వివిధ పూజలు చేశారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ సుధారాజు, టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, డోకుల అచ్చెంనాయుడు తదితరులు పూజలు చేశారు. గ్రామపెద్దలు కూనిరెడ్డి శ్రీరామమూర్తి, కొటకల రాంబాబు, కూనిరెడ్డి ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ పూజల్లో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

భవనం నిర్మించారు.. మరుగుదొడ్లు మరిచారు

● గరుగుబిల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి ఇబ్బందులు

గరుగుబిల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి పీహెచ్‌సీలో భవన నిర్మాణం పూర్తిచేసినా మరుగుదొడ్ల నిర్మాణం మరిచిపోయారు. దీంతో ఇక్కడికి వైద్యసేవలకోసం వచ్చే రోగులు, ఆసుపత్రిలో విధులు నిర్వహించే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

గరుగుబిల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి భవననిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వం చర్యలుచేపట్టింది. గతంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో వైసీపీ ప్రభుత్వహయాంలో నాడు-నేడు పథకంలో మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు ప్రారంభించిన తర్వాత నిధులు సమస్య తలెత్తడంతో అర్థాంతరంగా నిలిచిపోయాయి.ఈనేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ. 55 లక్షలు నిధులు కేటాయించింది. ఈ నిధులతో భవన నిర్మాణానికి సంబంధించి పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. గతంలోఉన్న మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయి.ఈనేపథ్యంలో నూతనంగా ఆసుపత్రి అదనపు భవనాలు నిర్మించినా, అవసరమైన మరుగుదొడ్లకు చర్యలు చేపట్టలేదు. దీంతో ఆరోగ్య కేంద్రంలో మరుగుదొడ్లు సౌకర్యం లేక సిబ్బంది అవస్థలు ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతమున్న ఆరోగ్యకేంద్రం ఇరుగ్గాఉండడంతో పరీక్షలు నిర్వహణ,మందులు నిల్వలకు సరైన సౌకర్యం లేని పరిస్థితి నెలకొంది. చికిత్స నిర్వహణకు వైద్యులకు సరైనసౌకర్యం లేని దుస్థితి నెలకొంది. అయితే ప్రభుత్వం నూతనంగా భవనం నిర్మించినా సిబ్బందికి అవసరమైన మరుగుదొడ్లు సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు.

ఆరోగ్యశాఖ అధికారికి వివరించాం

మరుగుదొడ్లసౌకర్యంలేక అవస్థలు ఎదుర్కొంటున్నామని,వసతి సమస్య కూడా ఉందని వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. మరుగుదొడ్లకు సంబంధించి సెప్టిక్ ట్యాంకు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వివరించినట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి మరుగుదొడ్ల నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. గతంలో నిర్మించిన కోవిడ్ భవనాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అప్పగించలేదని, సంబంధిత అధికారులు చొరవ చూపి భవనాన్ని ఆరోగ్య కేంద్రానికి అప్పగించాలని కోరారు. నాడు-నేడు పథకంలో నిధులు మంజూరైనా అసంపూర్తిగా పనులు నిలిచాయని, త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.



గరుగుబిల్లిలో నిర్మించిన అదనపు భవనం

లోకేశ్ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటున్నారన్నారు. గుంటూరు, విజయవాడ, గోదావరి జిల్లాలకు మించి ఉత్తమ ఫలితాలు సాధించిన మన్యం విద్యార్థులను ప్రశంసించడం కోసం ఆయన జిల్లాకు వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో పాటు నగదు ప్రోత్సాహకాలను కూడా అందిస్తారని తెలిపారు. వారి వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఏఎస్పీ అంకిత సురానా, డీఆర్‌వో హేమలత, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, అమరావతి నుంచి వచ్చిన లోకేశ్ సభ వేదిక బృందం ప్రతినిధులు రవితేజ, శ్రీకాంత్ , యువగళం ప్రతినిధి కోలక రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● అనంతరం వారు పార్వతీపురం మండలం చినబొండపల్లి ప్రాంతంలో సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల రాకపోకలతో పాటు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సభా వేదికపైకి ఎవరెవరిని అనుమతించాలి తదితర అంశాలపై ఎస్పీతో చర్చించారు.

సమగ్ర నీటి పథకానికి మోక్షం

(5వ పేజీ తరువాయి)

రోజువారీగా 3.5 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా చేస్తున్నారు. బంగారమ్మపేట, పీఎస్‌బొడ్డవలస, శ్రీనివాసనగర్ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులున్నాయి. సమగ్ర నీటి పథకం పూర్తి చేస్తే పట్టణవాసులకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా కానుంది. శివారు ప్రాంతవాసుల కష్టాలు కూడా తీరనున్నాయి. కాగా ఈ పనుల కోసం మళ్లీ టెండర్లు పిలవడానికి పాలకవర్గం సమాయత్తమవుతుంది.

టెండర్లు పిలుస్తాం

ఏఐఐబీ నిధులతో సమగ్ర నీటి పథకం పనులకు మళ్లీ టెండర్లు పిలవనున్నాం. పాత కాంట్రాక్టర్ పనులు చేయకుండా వెళ్లిపోయారు. అందువల్ల మళ్లీ టెండర్లు పిలిచి నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయిస్తాం. అంచనా వ్యయం పెరగడంతో సుమారు రూ.90 కోట్లతో ప్రభుత్వానికి మళ్లీ నివేదికలు పంపించాం.

- టీవీ ప్రసాద్, మున్సిపల్ డీఈ, సాలూరు

డబ్బులిస్తే ఉద్యోగం!

(5వ పేజీ తరువాయి)

వస్తాయని నిరుద్యోగులు నిలదీయగా.. డబ్బులు తీసుకున్న వారు అమరావతి సెక్రటరియేట్‌కు గతేడాది తీసుకువెళ్లారు. అక్కడ రెవెన్యూ, అటవీశాఖ, రైల్వే, సాంఘిక సంక్షేమ శాఖల్లో ఔట్ సోర్సింగుల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ ఆ శాఖలను చూపించి కొంత సమయం పడుతుందని కాలక్షేపం చేసుకుంటూవచ్చారు.ఆ తరువాత పత్తాలేకుండా పోవడంతో ధర్మవరానికి చెందిన సిరికి వినోద్ ఈ ఏడాది ఫిబ్రవరిలో సుజిత్‌పై విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు విచారణను వేగవంతం చేశారు. ఇటీవల సుజిత్ అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలయ్యాడు. అతని ద్వారా మిగిలిన నిందితులకు ఫోన్ చేయించారు. దీంతో సుజిత్‌ను పరామర్శించేందుకు ఆస్పత్రికి వచ్చిన చెక్కా మహేష్, నైనారపు చేతన్ రూబిన్ కూమార్, గుంటూరు జాన్, కలపల యాకోబ్‌ను పోలీసులుఅదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించి విచారించారు. దీంతో మోసం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.6 లక్షల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సుజిత్ ఆసుపత్రిలో ఉండగా, శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, శేషగిరిరావు, లక్ష్మీనారాయణ రెడ్డి పరారీలో ఉన్నారని చెప్పారు.వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. ఈ గ్యాంగ్ పలు జిల్లాల్లో మోసాలకు పాల్పడినట్టు విచారణలో వెల్లడైందని అన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భారీ వర్షాలపై అప్రమత్తం: కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

గంభూజియా చేపలను పెంచాలని, ప్రతి ఇంటిలోనూ, స్ప్రేయింగ్ చేపట్టాలని సూచించారు. దోమతెరల వినియోగం, ప్రయోజనాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు.

నేడు సీనియర్ సిటిజన్ల యోగా

యోగాంధ్రలో భాగంగా ఆదివారం సీనియర్ సిటిజన్లతో యోగా కార్యక్రమం నిర్వహించ నున్నట్లు కలెక్టర్ తెలిపారు. సాలూరు, పార్వతీపురం, పాలకొండ పరిధిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా సాయి పోటీలు జరుగుతాయన్నారు.

9న నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ విడుదల

నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్‌ను ఈ నెల 9న విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా యాక్షన్ ప్లాన్‌ను ఆవిష్కరించనున్నారని వెల్లడించారు. అనంతరం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నాలుగు రోజులపాటు సచివాలయాల్లో

సేవలకు అంతరాయం

(5వ పేజీ తరువాయి)

ఆదాయ, సమగ్ర, నివాస స్థల, వృద్ధాప్య, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్లు, రేషన్, రైస్ కార్డులు, రెవెన్యూ వాటర్ ట్యాక్స్, పట్టణ పరిపాలనకు సంబంధించి మొత్తం పది సేవలకు నాలుగు రోజుల పాటు అంతరాయం కలగనుంది. వాటిని మినహాయించి మిగిలినవి మీసేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. దీనిపై డ్వామా పీడీ కె.రామచంద్రరావును వివరణ కోరగా.. డైరెక్టర్ నుంచి ఆదేశాలు అందిన మాట వాస్తవమేనని తెలిపారు. జిల్లాలోని సచివాలయాలు, ఎంపీడీవోలకు సమాచారం అందించామన్నారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె నోటీసు

పాలకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కార్మికుల వేతనాలు పెంచాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పాలకొండ నగర పంచాయతీ కమిటీ నాయకులు కోరారు.ఈ మేరకు శనివారంనగర పంచాయతీ కమిషనర్ రత్నరాజుకు సమ్మెనోటీసు ఏపీమునిసిపల్ వర్కర్స్అండ్ ఫెడరేషన్ నగర పంచాయతీ కమిటీ గౌరవాధ్యక్షుడు దావాల రమణారావు, ఇంజనీరింగ్ విభాగం కన్వీనర్ వై.హరిబాబు, ప్రతినిధివర్గం వై.సురేష్, బి.శివ, పి.అప్పల కొండ, ఎస్.అరవింద్ అందజేశారు.



కమిషనర్ రత్నంరాజుకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

12 నుంచి ప్రతి జిల్లాలోనూ వికాశ్ మేళా

● వాణిజ్య శాఖ మంత్రి బిభుధిభూషణ్ జెన్నా

రాయగడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఈ నెల 12 నుంచి 18 వరకు వికాశ్‌మేళా నిర్వహించనున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి బిభుధిభూషణ్ జెన్నా తెలిపారు. శనివారం రాయగడ జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జిల్లా పాలనాధికారి పారుల్ పట్వారి అధ్యక్షతన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికాశ్ మేళా కార్యక్రమంలో భాగంగా కిషాన్, యువ, నారీ, యువ, ఆదివాసీ శక్తి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధి గురించి స్థానిక జీసీడీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎగ్జిబిషన్ పెవిలియన్ ద్వారా ప్రజలకు వివరిస్తారన్నారు. మై డ్రీమ్ ఒడిశా-2036, మైడ్రీమ్ ఇండియా 2047 సంప్రదాయ ఉత్సవంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు ఉత్సవ వేడుకలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఏడీఎంవో నవీన్‌కుమార్ నాయక్, జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి, అక్షయ్‌కుమార్ ఖెముండు, సబ్‌కలెక్టర్ రమేష్‌కుమార్ జెన్నా పాల్గొన్నారు.

మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు సరికాదు

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):అమరావతి మహిళలపై మాజీ సీఎం జగన్‌కు చెందిన దినపత్రిక విలేకరి కృష్ణంరాజు అసభ్యకర వ్యాఖ్యలు సరికాదని, వీటిని ఖండిస్తున్నానని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు.శనివారం గుమ్మలక్ష్మీపురం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ మహిళలను గౌరవిస్తోందని, వైఎస్ భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం కార్యకర్తను కఠినంగా శిక్షించామని తెలిపారు. జగన్‌కు చెందిన పత్రిక విలేకరి కృష్ణంరాజు రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన మహిళలను అసభ్యకరంగా మాట్లాడడంపై శిక్షించాలని కోరారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి

మన్యం జిల్లాలో సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి నాయకులు, కార్యకర్తలకు శనివారం ఒక ప్రకటన పిలుపునిచ్చారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మక్కువ, జూన్ 7(ఆంధ్రజ్యోతి):మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎస్.వెంకటరమణమూర్తి హెచ్చరించారు. శనివారం మక్కువ మెయిన్‌రోడ్డు జంక్షన్‌లో బ్రీత్ ఎనలైజర్‌తో వాహనచోదకులకు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డులకు ఆరుగురి ఎంపిక

వీరఘట్టం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమఫలితాలు సాధించిన ఆరు గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. వీరఘట్టం కేజీబీవీ విద్యార్థిని గంటేడ నందిని, నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ధర్మాన గ్రీష్మ, కోమటి యువరాజు, గంగంపేట జీటీడబ్ల్యుఏ హైస్కూల్ విద్యార్థి ఆరిక స్టీఫెన్‌పాల్‌తో మరోఇద్దరి ఎంపికకావడంతోఎంఈవోలు గౌరునాయుడు,ఆనందరావు, హెచ్‌ఎంలు అభినందించారు.

●బొబ్బిలి రూరల్,జూన్7(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంట జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి కునుకు రేవంత్ పదో తరగతిలో ప్రతిభ కనబరచడంతో దివ్యాంగుల కోటాలో షైనింగ్ స్టార్ అవార్డుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసింది. అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వై.తేజేశ్వరి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యింది. ఈమేరకు వారిని హెచ్‌ఎం ఎం.వేణుగోపాల్ అభినందించారు.

తక్షణమే హాస్టళ్లు తెరవాలి

బొబ్బిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకోసం తక్షణమే హాస్టళ్లను తెరవకపోతే ఆందోళన చేపడతామని బొబ్బిలి ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శివ ఒకప్రకటనలో హెచ్చరించారు.వేసవిసెలవుల అనంతరం విద్యాసంస్థలు తెరస్తున్నా హాస్టళ్లను ఓపెన్ చేయడంలేదని తెలిపారు. కళాశాలలు తెరిచా హాస్టళ్ల తెరవకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బొబ్బిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బేబీనాయన శనివారం అందజేశారు. బాడంగి మండలంలోని గొల్లాదికి చెందిన బంటు వెంకట రమణ క్యాన్సర్‌తో మృతిచెందిన విష యం విదితమే.అయితేఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి రూ. ఎనిమిది లక్షలు, బొబ్బిలి రావువారి వీధికి చెందిన అంపోలు శరత్‌కుమార్‌కు చెందిన ఐదేళ్ల కుమార్తెకు రూ. 20 వేలు చొప్పున మంజూరైన చెక్కులను ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బొత్స అప్పలు, బొబ్బాది తవిటినాయుడు పాల్గొన్నారు.

రేపు బాడంగిలో యోగా ర్యాలీ

బాడంగి, జూన్ 7(ఆంధ్రజ్యోతి):స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జేసీ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 6.30 గంటలకు యోగాంధ్ర మెగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్నిశాఖల మండల స్థాయి అధికారులు సిబ్బందితో హాజరుకావాలని కోరారు.

7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మక్కువ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై ఏడో తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా ఇన్‌చార్జి బోసు మన్మథరావు మాదిగ తెలిపారు. మండలంలోని కవిరిపలిలో మాదిగలతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చింతాడ అప్పారావు, అల మండ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వరప్రసాద్

బాడంగి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జి.వరప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన్ను సిబ్బంది అభినందించారు.

రూ.2,300 కోట్లతో వార్షిక ప్రణాళిక

● పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే లక్ష్యం: డీఆర్‌డీఏ పీడీ

బొబ్బిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం అమలులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఓ మహిళను పారిశ్రామికవేత్తగా తయారుచేయించి అభివృద్ధి చేయించాలన్నదే లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. శనివారం బొబ్బిలి గ్రోత్‌సెంటరులో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.2300 కోట్ల రూపాయలతో ఎంఎస్‌ఎంఈ, పీఎంజీఎస్‌వై యూనిట్ల ఏర్పాటుకోసం వార్షికప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. మహిళా స్వయంసహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేలా బ్యాంకర్లతో అవగాహన కుదిరిందన్నారు.నూతనపారిశ్రామిక విధానంలోలక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో మాదిరిగా ఉన్నత స్థాయిలో లక్ష్యాలను నిర్ధేశించకుండా క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వారి అవసరాలను గుర్తించి ప్రోత్సాహకాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మూకుమ్మడిగా రుణవితరణ ఇచ్చే విధానం కాకుండా మహిళలకు వ్యక్తిగతంగా వారికి ఎప్పుడు అవసరమైతే అప్పుడే రుణం తీసుకునేలా బ్యాంకులు సమ్మతించాయన్నారు. దీంతో రుణగ్రహీతలకు వడ్డీ భారం తగ్గుతుందన్నారు. యూనిట్లు స్థాపించుకునేవారికి 35 శాతం సబ్సిడీ ఉంటుందని, ఇందులోని భాగంగా రూ. 50 లక్షల వరకు మార్జిన్ కూడా అందిస్తున్నామని చెప్పారు. బొబ్బిలిలో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ గ్రాన్యూల్స్ బై బ్యాక్ పాలసీలో శిరీష ఏర్పాటు చేసేందుకు సహకరించామన్నారు. అలాగే ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో ఓపరిశ్రమ ప్రారంభోత్సవంలో కలెక్టరు బీఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే బేబీనాయన, బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

పొలాల్లో గట్లువేసి.. నారుమళ్లు సిద్ధంచేసి..

● గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు



దుక్కు దున్నుతున్న రైతు

గుమ్మలక్ష్మీపురం,జూన్ 7 (ఆంధ్రజ్యోతి):గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమవుతున్నారు. మే నెలాఖరు, జూన్ నెల మొదటి వారంలో నైరుతి రుతు పవనాల ప్రవేశం తర్వాత అడపాదడపా వర్షాలు కురవడంతో పొలాలను చదునుచేస్తున్నారు. కొందరు రైతులు ఎడ్లు, మరి కొందరు ట్రాక్టర్లతో ముమ్మరంగా దుక్కులు చేస్తున్నారు. పొలం గట్లును వేస్తున్నారు. నారుమళ్లను దుక్కుచేసి సిద్ధంచేస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో విత్తనాలు జల్లడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో సుమారు ఏడు వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగుచేసే అవకాశముంది. వర్షాలు అనుకూలిస్తాయన్న ఆశతో గిరిజనరైతులు వరి, పోడు వ్యవసాయంలో కంది మెట్ట భూముల్లో రాగులు తదితర పంటలు వేయడానికి సన్నద్ధమవు తున్నారు. మెట్ట ప్రాంతంలో కొందరు రైతులు పత్తి పంట వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏనుగులను జూకు తరలించాలి

సీతానగరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):ఏనుగుల గుంపును వచ్చిన చోటుకి లేదా జూకు తరలించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి వేణు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ రెండురోజులుగా ఏనుగుల గుంపు సంచరిస్తోందని,రెండేళ్ల కిందటకూడా మండలంలో ఏనుగుల గుంపు ప్రవేశించి పంటలను నాశనం చేసిందని తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు నేటికీ నష్ట పరిహారంచెల్లించలేదని చెప్పారు. మూడు నెలల కిందట అప్పయ్యపేట వద్ద ఏనుగుల జోన్ ఏర్పాటుచేసి ఏనుగులను సంరక్షిస్తామని అటవీశాఖ అధికారులు పనులు ప్రారంభిస్తే తమ పార్టీ అడుకుందని తెలిపారు.అటవీశాఖ అధికారులు గిరిజన, దళిత రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా వారి భూములకు పట్టాలిప్పిస్తామని, మూడు ఎకరాల్లో కుంకి ఏనుగులను తీసుకొచ్చి వాటి ద్వారా మచ్చిక చేయించి ఏనుగుల సంరక్షణతో పాటు ఎక్కడ నుంచి వచ్చాయో అక్కడికి తరలిస్తామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. నేటికీ కుంకి ఏనుగులు రాలేదని, ఇప్పుడు ఒడిశా నుంచి తప్పిపోయిన ఏనుగులను అప్పయ్యపేట తరలిస్తున్నట్లు ప్రజలు అనుమానిస్తున్నారన్నారు. ప్రజలకు ప్రాణ నష్టం, ఆస్తి, పంట నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, మండల నాయకులు గవర వెంకటరమణ, పార్టీ సభ్యులు చందనపల్లి కృష్ణ, వై.రామారావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్డి వేణు

మన్యంలో భారీ వర్షం



పాలకొండలోవర్షం కురుస్తున్న దృశ్యం

పాలకొండ/వీరఘట్టం/సీతంపేట రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాలకొండ, వీరఘట్టం, సీతంపేట మన్యంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పాలకొండ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం నీరు రోడ్డుపై పారింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వీరఘట్టం మండలంలోని ఉరుములు, శబ్దాలకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ఉదయం ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు భారీ వర్షం ఉపశమనం కలిగించింది. వర్షంతో ఖరీఫ్ పనులు ఊపందుకోనున్నాయి.

రాయితీపై పశు దాణా

పాచిపెంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు 50శాతం రాయితీపై ప్రభుత్వం పశు దాణా మంజూరు చేసిందని సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ తెలిపారు. శనివారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వద్ద రైతులకు పశు దాణా అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 286 క్వింటాళ్ల పశు దాణా మంజూరైందని తెలిపారు. 50 కేజీల బస్తా రూ.1,110 కాగా రాయితీతో రూ. 555లకు వస్తుందని తెలిపారు.కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎంవీ రమణ,గూడేపు యుగంధర్, పూసర్ల నర్సింగరావు, దండి కొండలరావు, కొత్తల పోలినాయుడు పాల్గొన్నారు.

డబ్బురువలసలో కలశ పూజలు

మక్కువ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బురువలసలో అభయాంజనేయస్వామి ఆలయప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు కలశపూజలను వేద పండితులు ఆరవెల్లి విజయకుమారశర్మ ఆధ్వర్యంలో చేశారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదివారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

బాడంగి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పలు ఆన్‌లైన్ సేవలకు శనివారం నుంచి పదో తేదీ వరకూ అంతరాయం కలుగుతుందని తహసీల్దార్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం సూచనల మేరకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలిస్తుండడంతో పలుసేవలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈమేరకుఆదాయ, సమగ్ర, వృద్ధాప్య, వివాహ ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, రేషన్, రైస్ కార్డులు, ఇళ్ల స్థల పట్టాలు, రెవెన్యూ వాటర్ ట్యాక్స్ పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు మినహా మిగిలిన అన్ని సేవలు మీసేవా కేంద్రాలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

● విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయల సంఘాల నిరసన



రామభద్రపురం: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బదిలీలకు సంబంధించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. ఈ మేరకు బొబ్బిలి, రామభద్రపురం ఎంఈవోకార్యాలయాల వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం నిరసన తెలిపారు.

●బొబ్బిలి రూరల్, జూన్7 (ఆంధ్రజ్యోతి): హామీ మేరకు ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. వెబ్‌ఆప్షన్లకు బాయ్‌కాట్ చేయాలని తెలిపారు. ఈమేరకు శనివారం బొబ్బిలి ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి,ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా వెబ్ కౌన్సెలింగ్‌లో ఇప్పటికే పలు పొరపాట్లు జరుగుతుండడంతో టీచర్లు నష్టపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. పదిరోజుల కిందట ప్రభుత్వం ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీఇచ్చి, వెబ్ ఆప్షన్లు పెట్టుకోవా లని పేర్కొనడం మాట తప్పడమేనని ఆరోపించారు. వెబ్ ఆప్షన్ విధానాన్ని వెనక్కు తీసుకోకపోతే జిల్లావిద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, విజయగౌరి, శ్రీనివాస్, రామారావు, సుధాకర్, మహేష్ పాల్గొన్నారు.

●రామభద్రపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తేనే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందని యుటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం రామభద్రపురం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద వెబ్‌కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు బొప్పె రవికుమార్, ముసలయ్య, వెంకటరావు, కర్రి శ్రీనివాసరావు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెబ్‌కౌన్సెలింగ్‌ను అన్నిఉపాధ్యాయ సంఘాలు బహిష్కరిస్తున్నాయని తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు: ఏఈఈ

గరుగుబిల్లి,జూన్7(ఆంధ్రజ్యోతి):విద్యుత్ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్‌కో మండల ఏఈఈ బి.శ్రీనివాసుల నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగూరు, గరుగుబిల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని 25 పంచాయతీల్లో రహదారులకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం,వేలాడుతున్న వైర్లను సరిచేయడం వంటి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వైర్లపై ఉండే కొమ్మలను తొలగింపు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. భారీగాలులు వీచిన, వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొనకుండా లోడ్‌కు, లైన్‌కు మధ్యలో క్లియరెన్స్ పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులకు గృహ అవసరాలకు 24 గంటలు, రైతుల వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరాకు లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
CM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

